వనమహోత్సవానికి సర్వం సిద్ధం

- 28 నర్సరీల్లో 1.20 లక్షల మొక్కల పెంపకం
- లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు
- నేడో, రేపో ప్రారంభం కానున్న మొక్కలు నాటే కార్యక్రమం



ధరూరు గ్రామ శివారులో నర్సరీలో పెంచుతున్న మొక్కలు

ధరూరు: వనమహోత్సవ కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 28 నర్సరీల్లో 1.20 లక్షల మొక్కలు పెంచుతున్నారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు. నర్సరీల్లోని ప్రతి మొక్కను నాటే విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వనమహోత్సవంపై మండల అభివృద్ధి అధికారి, ఈజీఎస్ అధికారులు నిరంతరం నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

అధికారుల పరిశీలనలతో కదలిక

గ్రామాల్లో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకాన్ని జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సారవంతమైన మట్టిని బ్యాగుల్లో నింపాలని, అప్పుడే మొక్కలు బలంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్, మండల అధికారులు ఇప్పటికే పలుమార్లు నర్సరీ నిర్వాహకులకు తెలియజేశారు. 20 రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మొక్కల పంపెకానికి వాతావరణం అనువుగా మారింది.

నర్సరీల్లో మొక్కల కళకళ

ఇటీవల కురిసన వర్షాలతో నర్సరీల్లో మొక్కలకు మరింత ఊతమిచ్చినట్లయింది. పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించే చెట్లతో కలిగే లాభాలను అధికారులు గ్రామీణ ప్రజలకు వివరిస్తున్నారు. ఇప్పటికే ఉపాధి కూలీల ద్వారా తీయించిన గుంతల్లో మొక్కలు నాటేందుకు అధికారులు సంసిద్ధమవుతున్నారు. రెండు రోజుల్లో మండలంలో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని ప్రారంభం కానున్నట్లు ఈజీఎస్ అధికారులు చెబుతున్నారు. మండలంలోని 28 గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పొలాల గట్ల వెంట మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.



అల్వలపాడు నర్సరీలో పెంచిన మొక్కలు

లక్ష్యాన్ని అధిగమిస్తాం



హరిత లక్ష్యాన్ని అధిగమించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నర్సరీల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను పరిశీలనకు పంపుతున్నాం. మొక్కల పెంపకంపై రైతులకు, గ్రామీణ ప్రాంత వాసులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– శరత్, ఏపీఓ, ధరూరు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ధరూరు పీహెచ్‌సీ వద్ద టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది



ఉండవెల్లిలో టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ధరూరు: సీజనల్‌గా వచ్చే వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు ఆయేషా బేగం అన్నారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందినుద్దేశించి డాక్టర్ మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, కఫంలో రక్తం పడటం, అలసట, శరీరంలో కణతల వాపు, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉంటే అటువంటి వారికి వెంటనే చికిత్స అందించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో టీబీ అనుమానితులను 102 మందిని గుర్తించినట్లు తెలిపారు. టీబీ వ్యాధి సోకిన వారు భయపడాల్సిన అవసరం లేదని, ఆరు నెలల కోర్సులో మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. సరైన పౌష్టికాహారం కోసం రూ.1,000 ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హీర్యానాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

ఉండవెల్లి: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు క్రమం తప్పకుండా మందుల వాడకంతో టీబీని నివారించవచ్చని టీబీ ప్రోగామింగ్ అధికారి రాజు అన్నారు. మండల కేంద్రంలోని పల్లెదవాఖానాలో సోమవారం టీబీ వ్యాధిగ్రస్తులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వ్యాధి సోకిన అనంతరం 6 నెలలు మందులు, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చికిత్స నిమిత్తం ప్రతి నెల రూ.1,000 ఆర్థిక సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సాదిక్, సూపర్‌వైజర్ చంద్రన్న, వైద్య సిబ్బంది గురు బసవయ్య, కిరణ్‌కుమార్, ఏఎన్‌ఎంలు సుభాషిణి, వినోదిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



గద్వాలలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఉండవెల్లిలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గద్వాలటౌన్/మానవపాడు/అయిజ/ఉండవెల్లి/ధరూరు/గట్టు: ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు చేపట్టారు. మందకృష్ణ మాదిగ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజు, అశోక్, పరుశరాం, మహేష్ బీకే నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

☆ మానవపాడు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం రాష్ట్ర నాయకుడు మస్తాన్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు.

☆ అయిజ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దిన సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మారెప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

☆ ఉండవెల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జిల్లా నాయకుడు ఎలీషా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, దేవదాసు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

☆ ధరూరు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని నెట్టెంపాడు, మన్నాపురం, మార్లబీడు గ్రామాల్లో ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.

☆ గట్టు మండల పరిధిలోని ఆరగిద్ద, రాయాపురం గ్రామాల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్ర సతీష్‌మాదిగ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బల్గెర ఏసన్న, బండారి డేవిడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం



చాగాపురంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం



బుడ్డారెడ్డిపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఇటిక్యాల: పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసిందని మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన చెత్తా చెదారం, మురుగు పేరుకుపోయినట్లు వాపోతున్నారు. రోడ్డుపై పారుతున్న మురుగుతో దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా వీధి దీపాలు రోజుల తరబడి వెలగడం లేదని చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి గ్రామలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో లబ్ధిదారుడికి సోమవారం ఎమ్మెల్యే విజయుడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఎర్రవల్లి మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన జహంగీర్ బాషకు రూ.12 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు వితరణ



మానవపాడు: మండలంలోని నారాయణపురంలోని బాలయోగి శివ నారాయణస్వామి ఆలయ నిర్మాణానికి పారిశ్రామికవేత్త ఆవుల జయసుధ, వెంకటనారాయణరెడ్డి దంపతులు రూ.5లక్షలు అందజేశారు. సోమవారం ఆలయ కమిటీకి ఈ మేరకు నగదు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ సతీష్‌రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

రాజోళి: శాంతిగనర్ నిర్మాణం చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయానికి నిర్మాణానికి పట్టణంలోని నందీశ్వర సీడ్స్ షాపు యజమాని మహేష్ సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను అయ్యప్ప సేవా సమితి సభ్యులు అభినందించారు. దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమలో భాస్కర్‌రావు, వీరేష్‌గౌడ్, పొన్నం పూర్ణచంద్రరావు, రమేష్, జాలాది కృష్ణమూర్తి, సుధాకర్ తదిదరులు పాల్గొన్నారు.

సంబురంగా పీర్ల ఊరేగింపు



ధరూరు: మండల పరిధిలోని నెట్టెంపాడు మొహర్రం పండుగను వారం రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అలయ్ బలయ్ ఆడుతూ సందడి చేశారు. చివరి రోజు కావడంతో భారీ ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గద్వాల క్రైం: లారీ డ్రైవర్ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన అజాంపాషా లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రమైన తిరిగి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో అజాంపాషా తల్లి ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో.. ఇద్దరికి గాయాలు

అయిజ: పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన సురేష్, జయమ్మ (వదిన, మరది) సోమవారం బైక్‌పై పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు వెళ్తున్న సమయంలో ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పిన ట్రాక్టర్



మానవపాడు: మండల కేంద్రంలో పంచాయతీ ట్రాక్టర్ సోమవారం అదుపుతప్పి బురదలో ఇరుక్కుపోయింది. బాలుర వసతిగృహం సమీపంలోని బోరు వద్ద ట్యాంకర్‌లో నీటిని నింపుకొని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన బురదలో ఇరుక్కుపోయింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గద్వాలటౌన్: ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు గద్వాల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి 9 మంది విద్యార్థినులు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులు స్వాతి, పవిత్ర, శ్రీవిద్య, నందిని, రమ్యబిందు, చైతన్య, మాణిక్య, పల్లవి, శోభ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థినులను హెచ్‌ఎం జహురుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ స్రవంతి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని వినతి



అలంపూర్: పట్టణంలోని సంతోష్‌నగర్ నుంచి గొందిమల్లకు వెళ్లే రోడ్డును బాగు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ శ్రీరాములుకు సోమవారం వినతిపత్రం అందచేశారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నట్లు తెలిపారు. గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండి వాహనాలు అదుపుతప్పుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, శ్రీనువాసులు తదిదరులు పాల్గొన్నారు.

సొంతింటి కలకు సాకారం



ధరూరు: నిరుపేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని మాజీ వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌దొడ్డి గ్రామంలో 50 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ముగ్గుపోసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్, నాయకులు భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

కేటీదొడ్డి: భూమి ఉన్న ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈఓ ప్రీతిసుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలు అందాలన్నా, రైతుగా గుర్తింపు ఉండాలన్నా, రైతు నమోదు సంఖ్య తప్పనిసరని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భైరాపురం గ్రామస్తులు

ఉండవెల్లి: మండలంలోని భైరాపురంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. గతంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన వెంటనే సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రస్తుతు ఏర్పాటు చేయలేమని చెబుతున్నారని ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మోయినుద్దీన్, నాగరాజు, సుంకన్న, రవి, చెన్నయ్య పాల్గొన్నారు.

పునరావాసంలో సమస్యలు పరిష్కరించాలి



ఈఈకి సమస్యలు విన్నవిస్తున్న మాజీ ఎంపీపీ, గ్రామస్తులు

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లె పునరావాస సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీపీ విజయ్ కుమార్‌తో కలిసి చిన్నోనిపల్లె నిర్వాసితులు సోమవారం ఈఈ రహీముద్దీన్‌ను కలిసి విన్నవించారు. చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్, డ్రైయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు, అదే విధంగా పాఠశాల లేక 5 కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లి విద్యార్థులు చదువుకునే పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పెద్దవెంకన్నగౌడ్, వెంకటేష్, తిమ్మారెడ్డి, రామచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై విచారణ

గట్టు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ వ్యవహారంపై సోమవారం ఎంపీఓ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి కుర్మయ్య విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ దగ్గర కొత్తగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మిస్తున్నారంటూ మాజీ సర్పంచ్ ధనలక్ష్మి వర్గానికి చెందిన కొందరు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్న చోటుకు చేరుకున్న తరుణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న వారికి, మాజీ సర్పంచ్ వర్గీయులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకొని షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారని ఒక వర్గం ఆరోపించగా, అలాంటిదేమి లేదని నిబంధనల మేరకే అనుమతులు తీసుకొని షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న తరుణంలో పోలీసులు జోక్యం చేసుకొని గొడవ సద్దుమణిగించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎంపీఓ రవి కుమార్ పేర్కొన్నారు.

రెండేళ్ల అనంతరం పాఠశాల పునఃప్రారంభం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్

మల్దకల్: గత రెండు సంవత్సరాలుగా మూతపడిన ఎద్దులగూడెం ప్రాథమిక పాఠశాలను సోమవారం జిల్లా సమన్వయ అధికారి అంపయ్య, ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలకు ప్రస్తుతం డిప్యూటేషన్‌పై స్వామిని నియమించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. తమ పిల్లలను తమ ఊరిబడిలో చేర్పించాలని గ్రామస్తులను కోరారు. మొదటి రోజే 15 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. కార్యక్రమంలో సీఆర్పీ పరుమన్న, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



గద్వాలలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు నర్సింహ



మానవపాడులో సార్వత్రిక సమ్మె కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు చేస్తున్న అన్యాయాలపై దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్, బుర్దాపేట, గాంధీచౌక్, సుంకులమ్మమెట్టు కాలనీల్లో ఉన్న ఆశావర్కర్లు, మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య కార్మికులను కలిసి కరపత్రాలు విడుదల చేశారు. సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పేరు నర్సింహ, గట్టన్న, పద్మ, సునీత, పార్వతమ్మ, వెంకటేశ్వరమ్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

జీఓ 282ను ఉపసంహరించుకోవాలి

మానవపాడు: రాష్ట్రం ప్రభుత్వం పని గంటలు పెంచుతూ ఇచ్చిన జీఓ 282ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాం హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి, రఫీ, రాజు, అల్లిపీర తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

రాజోళి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి మధుబాబుకు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మన్న, సీపీఎం పార్టీ సభ్యుడు కృష్ణ, సుజాత, అనిత తదితురులు పాల్గొన్నారు.

కేఎల్ఐ డీ–1 కాల్వకు మరమ్మతు చేపట్టాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్ళపల్లితండాలోని కేఎల్ఐ డీ–1 కాల్వ పరిధిని నిర్ధారించి మరమ్మతులు చేయాలని సోమవారం తండా ఆయకట్టు రైతులు ఇరిగేషన్ డీఈ వెంకటరమణదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్, రైతులు మాట్లాడుతూ.. కాల్వ మరమ్మతుకు జిల్లా అధికారులను అడిగితే మా పరిధిలో లేదని, నాగర్‌కర్నూల్ జిల్లా అధికారులను అడిగితే మా పరిధిలో లేదని చెబుతూ దాట వేస్తున్నారు. దీంతో కాల్వ మరమ్మతులు చేయక చివరి ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. జిల్లా అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాల్వ ఏ జిల్లా పరిధిలోకి వస్తుందో నిర్ధారించి మరమ్మతులు చేయాలని, లేనియెడల రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అయిజ: మండలంలోని తూంకుంట గ్రామంలో ప్రైవేటు పాఠశాలల బస్సులు ఢీకొన్న ఘటన సోమవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన కాకతీయ మెమోరియల్ స్కూల్, న్యూ గీతాంజలి హైస్కూల్ బస్సులు ఎదురెదురుగా వస్తున్న క్రమంలో ఒకదానికొకటి రాసుకుంటూ వెళ్లడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో బస్సుల్లో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల — కె.సీతాంజనులు - 9642913894
అలంపూర్/అయిజ — ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి